# తెలంగాణను కాపాడుకోవాలి



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ కరీంనగర్ ముఖ్యనాయకులు, బూత్ కమిటీ నాయకులు



బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

- ఎన్నికల్లో మనం తప్పు చేస్తే భవిష్యత్ తరాలు అంధకారం
- మరోసారి ఆశీర్వదిస్తే మరింత గొప్పగా పని చేస్తా
- కాంగ్రెస్ పార్టీ హామీలకే పరిమితం
- మంత్రి గంగుల కమలాకర్
- కరీంనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం

కార్పొరేషన్, అక్టోబర్ 16: రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తు కోసం తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పోలింగ్ బూత్ కన్వీనర్, కో కన్వీనర్, ఇన్‌చార్జిలు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గ చరిత్రలో ఒకసారి గెలిచిన వ్యక్తి మరోసారి గెలవలేదని, తనను నమ్మి మూడు సార్లు గెలిపించారని, ఈ పదవి తనదే అయినా మీరు పెట్టిన భిక్షేనని పేర్కొన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత గొప్పగా పనిచేస్తానన్నారు. తెలంగాణ సంక్షేమ ఫలాలు భవిష్యత్ తరాలకు అందాలంటే మరోసారి సీఎం కేసీఆర్ చేతులను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ లేని తెలంగాణ ఊహించుకోలేమన్నారు. మనం తప్పు చేస్తే భవిష్యత్ తరాలు అంధకారం అవుతాయని హెచ్చరించారు. పచ్చని తెలంగాణలో చిచ్చు పెట్టి మన సంపద దోచుకెళ్లాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పదేళ్ల సీఎం కేసీఆర్ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ 90కి పైగా సీట్లు సాధించి అధికారంలోకి రానున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం హామీలకే పరిమితమని, వాటిని అమలు చేయదని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి మూటలు అయ్యాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ ఒక పంట ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలు నమ్మే స్థితి లేదన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి చేసి చూపిందని, అందుకే ప్రజలు కూడా సీఎం కేసీఆర్‌పై నమ్మకంతో ఉన్నారని పేర్కొన్నారు. 45 రోజులు తన కోసం పనిచేస్తే 5 ఏళ్లు మీకోసం పని చేస్తానని ప్రమాణం చేశారు. పదవులు ఎన్ని వచ్చినా తాను మారే వ్యక్తిని కాదని, పార్టీ కార్యకర్తలే తమ బలమని పేర్కొన్నారు. ఈ నెల 18న ప్రజాఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. దీనిని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామో కూడా చెప్పాల్సినా అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో పదేళ్లు పెంచిన సంపదను పేదలకు పంచుతున్నామని పేర్కొన్నారు. భారీ స్థాయిలో క్యాడర్ ఉన్న పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని తెలిపారు. ఇతర పార్టీలకు ఈ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు లేరన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు సాగి మరోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, పార్టీ మండలాధ్యక్షులు శ్యామ్ సుందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాయకులు మహేశ్ గౌడ్, వాసాల రమేశ్, పిట్టల రవీందర్, జమీలొద్దీన్ , సాబీర్ పాషా, శౌకత్ అలీ, నవాజ్, వాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఓటరునూ కలవాలి



బీఆర్‌ఎస్ కార్యకర్తలు నియోజకవర్గంలోని ప్రతి ఓటరునూ కలుసుకొని బీఆర్‌ఎస్ కార్యక్రమాలను వివరించాలి. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలి. సీఎం కేసీఆర్ హామీలపై ప్రజల్లో ఎంతో నమ్మకం ఉంది. కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అనేక పథకాలను కూడా తీసుకువచ్చిన విషయం ప్రజలకు గుర్తు చేయాలి.

*- యాదగిరి సునీల్‌రావు , నగర మేయర్*

### సమన్వయంతో పని చేసి గెలిపించాలి



బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి. వచ్చే ఎన్నికల్లో మంత్రి గంగుల కమలాకర్‌ను నాలుగో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. డివిజన్ల అధ్యక్షుల నియామకంతో పాటు 390 పోలింగ్ బూత్‌లకు కన్వీనర్, కో కన్వీనర్, ఇన్‌చార్జిలను కూడా నియమించాం. కార్యకర్తలు తమ పరిధిలోని ఓటర్లను కలుసుకొని ముందుకు సాగాలి. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించుకొని పార్టీని గెలిపించాలి.

*- చల్ల హరిశంకర్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు*



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

# హుజూరాబాద్ బీజేపీకి బిగ్ షాక్

- బీఆర్‌ఎస్‌లోకి ఈటల ముఖ్య అనుచరులు
- వారి వెంటనే మరో 200 మంది యూత్ నాయకులు, కార్యకర్తల చేరిక
- ఆహ్వానించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 16: హుజూరాబాద్‌లో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్యే, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ముఖ్య అనుచరులు, నియోజకవర్గ నాయకుడు, కార్యకర్తలు సుమారు 200 మంది సోమవారం బీఆర్‌ఎస్‌లోకి రాగా, కోలుకోలేని దెబ్బ తగిలింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జమ్మికుంటలో భారీ బహిరంగ సభ నిర్వహించిన రోజే గులాబీ గూటికి రాగా శ్రేణులను అయోమయంలో పడేసింది. ప్రధానంగా ఈటల ముఖ్య అనుచరుడు, నియోజకవర్గ నాయకుడు జవ్వాజి కుమారస్వామి, బీజేవైఎం హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి మార్క అరవింద్, వీణవంక మండల యూత్ కోఆర్డినేటర్ రాపర్తి అఖిల్, ఎలబాక కోఆప్షన్ సభ్యుడు పొన్నాల అనిల్, నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ఎండీ జానీ, సహా 200 ముఖ్య కార్యకర్తలు పార్టీలో చేరారు. ముంగా జమ్మికుంటలో భారీ ర్యాలీ తీశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి ఈటల ఓటమే తమ ధ్యేయమని ప్రతిజ్ఞ చేశారు. అక్కడి నుంచి నేరుగా హుజూరాబాద్‌కు వచ్చి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

### ఎంత కష్టపడ్డా గుర్తింపే లేదు

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఏడు సార్లు ఈటల గెలుపునకు కష్టపడినా కూడా తమకు తగిన గుర్తింపులేదని బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశనుంచే ఈటల వెంట ఉన్నప్పటికీ తమను పట్టించుకోలేదని విచారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరామని చెప్పారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నియోజకవర్గంలో చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమని బీఆర్‌ఎస్‌లో చేరడానికి కారణమయ్యాయని స్పష్టం చేశారు. యువకులు ఎదగాలంటే యువ నాయకుడు అవసరమన్నారు. కౌశిక్‌రెడ్డి యువకులందరికీ అవకాశాలు కల్పిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు.

### ఈటల నమ్మకం కోల్పోయాడు: ఎమ్మెల్సీ

హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ మరింత పటిష్టంగా మారిందని, ఈ సారి ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. గత ఉప ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకున్న ఈటలను ప్రజల నమ్మకాన్ని కోల్పోయాడని, ఏం చేసినా ఎవరూ నమ్మేస్థితిలో లేరన్నారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరినవారిలో ఇంకా విజయగిరి రాకేశ్, కనుకుల రాజు, గోనె రాజు, ప్రవీణ్, వీరస్వామి, బ్రహ్మం, మహమ్మద్ పాషా, మహ్మద్ అసిఫ్, శ్రీకాంత్, బన్నీ, వంశీ, 200 మంది ముఖ్య కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

# కారు జోరును ఆపడం ఎవరితరం కాదు



బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంపీటీసీ అంతం లత-రాజిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి, జీవీఆర్

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- బీఆర్‌ఎస్‌లో చేరిన లింగాపూర్ ఎంపీటీసీ లతారాజిరెడ్డి దంపతులు, మరో 150 మంది

శంకరపట్నం, అక్టోబర్ 16: కారు జోరును ఆపడం ఎవరి తరం కాదని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. శంకరపట్నం మండలంలోని లింగాపూర్ ఎంపీటీసీ అంతం లత బీజేపీకి చెందిన ఆమె భర్త రాజిరెడ్డితో కలిసి సోమవారం రాత్రి మానకొండూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌తో పాటు జీవీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింగాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 100 మందితో పాటు మెట్‌పల్లి గ్రామానికి చెందిన మరో 50 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరిలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన వార్డు సభ్యులు పొలవేని భాగ్య, ముద్రకోళ్ల నిరంజన్, అంతడ్పుల శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జీవీఆర్ మాట్లాడుతూ, కారు స్పీడ్ చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు బెంబేలెత్తుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గెలుపు లాంఛనమేనని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, సర్పంచులు కోండ్ర రాజయ్య, కలకుంట్ల రంజిత్‌రావు, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు అంతం తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వంగల కిషన్‌రెడ్డి, వేముల మనోహర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో ఓట్లన్నీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు వేసి గెలిపించుకుంటామని తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

# గంగుల గెలుపు కోసం ఏకగ్రీవ తీర్మానం

- మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఖాజీపూర్ వాసుల అభిమానం

కొత్తపల్లి, అక్టోబర్ 16 : కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌పై నియోజకవర్గ ప్రజలు తమకు ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి పరుస్తూ వరుసగా మూడుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించిన మంత్రిని మరో సారి గెలిపించుకుంటామని కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామస్తులు మూకుమ్మడిగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం గ్రామస్తులంతా ఒకేచోట చేరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామాన్ని మంత్రి గంగుల కమలాకర్ చేసినంత అభివృద్ధి ఏ నాయకుడూ చేయలేదని, ఆయనకు గ్రామస్తులమంతా రుణపడి ఉంటామన్నారు. ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకొనేందుకు గ్రామానికి చెందిన ఓట్లన్నీ వేస్తామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపూర్ సర్పంచ్ ఇల్లందుల రాజమ్మ, మాజీ సర్పంచులు శేఖర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు శంకర్‌గౌడ్, గ్రామాధ్యక్షుడు పంజాల రమేశ్, కార్యకర్తలు సోమినేని తిరుపతి, అంజిగౌడ్, రాముగౌడ్, ఇల్లందుల రాజశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.